ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 విజయనగరం
జిల్లా వార్తలు
సోమవారం 13 మే 2024



రండి... ఓటేద్దాం!

విజ్ఞతతో ఆలోచించి.. మంచి నేతను ఎన్నుకుందాం

(విజయనగరం)

ఓటు.. వజ్రాయుధం
రాజ్యాంగం కల్పించిన హక్కు
వ్యవస్థల మార్పునకు పునాది
మన తలరాత మార్చే అస్త్రం
నిజాయితీ నేతలను ఎన్నుకుందాం.

ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండగకు రంగం సిద్ధమైంది. 'మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. దేవుడు మీద కానీ, మహానుభావులపై కానీ ఆధారపడొద్దు' అన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటలు వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన రోజు వచ్చింది. ప్రజలు మెచ్చిన నేతను ఎన్నుకునే సమయం ఆసన్నమైంది.

-రండి.. అందరూ తరలిరండి. ఓటుహక్కు వినియోగించుకుందాం.

ప్రలోభాలకు లొంగకుండా.. నిజాయితీగా నిబద్ధతతో వ్యవహరించి.. విజ్ఞతతో ఆలోచించి సచ్ఛీలురైన పాలకులను ఎన్నుకుందాం. పాలనలో అనుభవం, నిబద్ధత నాయకులకు అవకాశం ఇద్దాం. సంక్షేమం, అభివృద్ధి కలగలిపి చేసే నేతలను గద్దెనెక్కిద్దాం. విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన వారిని ఇంటికి పంపిద్దాం. వ్యవస్థలను ధ్వంసం చేసిన వారికి బుద్ధి చెబుదాం. మన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల్లేకుండా చేసిన వారిని సాగనంపుదాం. ఈ సువర్ణావకాశాన్ని కచ్చితంగా సద్వినియోగం చేసుకుందాం. ఓటు అనే వజ్రాయుధంతో వ్యవస్థలో మార్పునకు నాంది పలుకుదాం. అవినీతి పరులను ఇంటికి పంపి.. మంచి నేతలను చట్ట సభలకు పంపిద్దాం. అవినీతిని నిర్మూలించి.. సుపరిపాలనకు శ్రీకారం చుడదాం.

-రండి.. ఓటరులారా.. తరలిరండి.. ఓటేద్దాం.

నేడు పైడిమాంబ దేవర ఉత్సవ చాటింపు

విజయనగరం రూరల్, మే 12: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ దేవర ఉత్సవానికి సంబంధించి చాటింపు కార్యక్రమం సంప్రదాయబద్ధంగా సోమవారం జరగనుంది. రైల్వే స్టేషన్ వద్ద వున్న వనం గుడి నుంచి మూడు లాంతర్ల వద్దనున్న చదురుగుడికి పైడిమాంబను తీసుకువచ్చే కార్యక్రమమే దేవర ఉత్సవం. ఏటా వైశాఖ మాసంలో నిర్ణయించిన ముహూర్తం ప్రకారం ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది మే 20న నిర్వహణకు పెద్దలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడు కొండలు, ఇతర సిబ్బంది, అర్చకులు దేవర ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా సోమవారం జరిగే చాటింపు తంతుకు అంతా సిద్ధమైంది.



పోలింగ్‌కు సర్వం సన్నద్ధం



- ఉదయం 7 గంటల నుంచి ప్రారంభం
- ఓటేయనున్న 15.6 లక్షల మంది ఓటర్లు
- పోలింగ్ మెటీరియల్‌తో గమ్యానికి చేరిన సిబ్బంది
- ఎండ తీవ్రతకు సొమ్మసిల్లిన ఓ ఉద్యోగి

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల మహాసంగ్రామం తుది దశకు చేరింది. ఐదేళ్ల పాలనకు ఓటరు తీర్పు ఇచ్చే రోజు వచ్చేసింది. మనను పాలించే నేతను మనమే ఎంపిక చేసుకునే కీలక సందర్భమిది. పోలింగ్‌కు సర్వం సన్నద్ధమైంది. సోమవారం ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికల మెటీరియల్‌తో ఆదివారం మధ్యాహ్నం నుంచి సిబ్బంది ఆయా గ్రామాలకు చేరుకున్నారు. ఆర్టీసీ సర్వీసులను ఎన్నికల విధులకు పెద్దసంఖ్యలో తరలించారు. ఆ బస్సుల్లోనే మెటీరియల్‌ను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లారు. విజయనగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గ కేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఎండ తీవ్రతకు విజయనగరం పీటీసీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో బొబ్బిలికి చెందిన బ్రహ్మాజీ అనే ఉద్యోగి సొమ్మసిల్లిపోయారు. సిబ్బంది సపర్యలు చేసి ప్రాథమిక వైద్యాన్ని అందించారు. కాగా సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 15,62,921 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈసారి దివ్యాంగుల కోసం బ్రెయిలీ బ్యాలెట్ నమూనాలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు.

- ఈ ఎన్నికల్లో రాజాం నియోజకవర్గం నుంచి 10 మంది, బొబ్బిలి నుంచి 8 మంది, చీపురుపల్లి 7, గజపతినగరం 13, నెల్లిమర్ల 12, విజయనగరం 15, ఎస్ కోట 12 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. రాజాం మినహా అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. రాజాంలో మాత్రం పురుషులు 114494 మంది ఉండగా మహిళలు 112990 మంది ఉన్నారు.
- పోలింగ్ పూర్తి చేసిన తరువాత ఈవీఎంలను జేఎన్‌టీయూ, లెండి ఇంజినీరింగ్ కళాశాలల్లోని రిసెప్షన్ సెంటర్లకు తరలించనున్నారు. వచ్చేనెల 4న జరిగే కౌంటింగ్ కేంద్రాలు కూడా ఇవే. జెఎన్‌టీయూలో విజయనగరం, బొబ్బిలి.. లెండి ఇంజినీరింగ్ కళాశాలలో నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, ఎస్.కోట, గజపతినగరం ఈవీఎంలను లెక్కించనున్నారు.
- జిల్లా వ్యాప్తంగా 1847 పోలింగ్ స్టేషన్ల ద్వారా ఓటింగ్ జరుగనుంది. 2276 పీవోలు, 2276 ఏపీఓలు, 9106 ఓపిఓలను నియమించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 361 గుర్తించారు. వీటికి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు.


విజయనగరం సంగీత కళాశాలలో పోలింగ్ కేంద్రం


సొమ్మసిల్లిన ఉద్యోగికి సపర్యలు

↑ విజయనగరం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో సిద్ధమవుతున్న ఉద్యోగులు

బరిలో ఉన్న అభ్యర్థులు వీరే..

విజయనగరం పార్లమెంట్ : కలిశెట్టి అప్పలనాయుడు(టీడీపీ), బెల్లాన చంద్రశేఖర్(వైసీపీ), బొబ్బిలి శ్రీనివాస్(కాంగ్రెస్).

విజయనగరం అసెంబ్లీ : పూసపాటి అదితి గజపతిరాజు(టీడీపీ), కోలగట్ల వీరభద్రస్వామి(వైసీపీ), సుంకరి సతీష్ (కాంగ్రెస్)

నెల్లిమర్ల : లోకం నాగమాధవి(జనసేన కూటమి), బడ్డుకొండ అప్పలనాయుడు(వైసీపీ), సరగడ రమేష్(కాంగ్రెస్)

చీపురుపల్లి : కిమిడి కళావెంకటరావు(టీడీపీ), బొత్స సత్యనారాయణ(వైసీపీ), జమ్ము ఆదినారాయణ (కాంగ్రెస్)

రాజాం : కోండ్రు మురళీమోహన్(టీడీపీ), డాక్టర్ తలె రాజేష్(వైసీపీ), కంబాల రాజవర్దన్(కాంగ్రెస్)

బొబ్బిలి : బేబీనాయన(టీడీపీ), శంబంగి వెంకటచినప్పలనాయుడు(వైసీపీ), మరిపి విద్యాసాగర్(కాంగ్రెస్)

గజపతినగరం : కొండపల్లి శ్రీనివాసరావు(టీడీపీ), బొత్స అప్పలనరసయ్య(వైసీపీ), డోల శ్రీనివాస్(కాంగ్రెస్)

శృంగవరపుకోట : కోళ్ల లలితకుమారి (టీడీపీ), కడుబండి శ్రీనివాసరావు(వైసీపీ), డాక్టర్ గేదెల తిరుపతి.

ఓటుకు వెయ్యి

- చివరి వరకు సాగిన పంపిణీ తంతు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ప్రలోభాల పర్వం విస్తృతంగా సాగింది. ఓటుకు వెయ్యి అనే మాట సర్వసాధారణంగా వినిపించింది. ఎక్కడ చూసినా నీకెంత అందింది.. నీకెంత ఇచ్చారు.. అని చర్చించుకున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 10వరకు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేపట్టారు. ఈ విషయంలో అధికార పార్టీ ముందువరుసలో ఉంది. పంపకాలను ఎటువంటి జంకు బొంకూ లేకుండా చేసుకుపోయారు. కొన్నిచోట్ల ఓటుకు రూ.1500 కూడా ఇచ్చారు. విజయనగరం పట్టణంలో పంపకాలకు ఇచ్చిన డబ్బులో కొంత మొత్తాన్ని ద్వితీయ శ్రేణి నాయకత్వం మిగుల్చుకుందట.

నిర్భయంగా ఓటేయండి

- అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు
- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ

విజయనగరం క్రైం, మే 12: ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ అన్నారు. విజయనగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎన్నికల భద్రతా ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం నగరంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భద్రతా పరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు. సివిల్, ఏఆర్ కేంద్ర బలగాలతో పాటు ఎన్‌సీసీ, ఎక్స్ ఆర్మీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లను వినియోగిస్తున్నా మన్నారు. ఎటువంటి ప్రలోభాలకు, భయాలకు లొంగాల్సిన అవసరం లేదని, ఓటు వేసేందుకు వచ్చిన వారికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట ఎస్పీ దీపిక, డీఎస్పీలు విశ్వనాథ్, యూనివర్స్, సీఐలు విజయ్‌నాథ్, నరిసింహమూర్తి, వెంకట్రావు, రామారావు, శ్రీనివాసరావు, డీఐజీ లైజన్ అధికారి రమణయ్య తదితరులు ఉన్నారు.


విజయనగరం: పోలీసులకు సూచనలిస్తున్న డీఐజీ

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

బొబ్బిలి/ గరివిడి, మే 12: బొబ్బిలి గ్రోత్‌సెంటరులోని ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వారీగా పీఓ, ఏపీవోలు, ఓపీఓలు, ఇతర సిబ్బంది, పోలీసుల కేటాయింపుపై ఆరా తీశారు. ఎన్నికల నిర్వహించే అధికారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. చిన్నపాటి సమస్య వచ్చినా ఆయా అధికారుల స్థాయిలో పరిష్కరించాలని, లేదంటే సంబంధిత ఉన్నతాధికారుల ద్వారా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రతిఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ త్రివినాగ్, రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

- చీపురుపల్లి నియోజకవర్గానికి సంబంధించి అధికార యంత్రాంగం గరివిడి డిగ్రీ కళాశా లలో ఎన్నికల సామాగ్రిని ఆదివారం పంపిణీ చేసింది. ఇక్కడి ప్రక్రియను కూడా కలెక్టర్ సందర్శించి అధికారులకు సలహాలు సూచనలు అందించారు.


బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఇబ్బందులున్నా.. ఓటే మిన్న

- బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించి స్వగ్రామాలకు చేరిన ఓటర్లు
- విక్టరీ గుర్తు చూపుతూ ఒకటే ఉత్సాహం

విజయనగరం(ఆంధ్రజ్యోతి), మే 12 : ఓటేయాలన్న ఉత్సాహంతో సొంత జిల్లాకు వచ్చిన ఓటర్లు జిల్లా కేంద్రానికి చేరాక అవస్థలు పడ్డారు. సమయానికి బస్సులు లేక.. ఉన్న కొద్దిపాటి సర్వీసుల్లో కిక్కిరిసి ప్రయాణించారు. ఎన్ని ఇబ్బందులున్నా ఓటేయాలన్న ఉత్సాహం వారిలో కనిపించింది. బస్సుల్లో సీటు దొరికే వరకూ మాత్రం వారు అనేక తిప్పలు పడ్డారు. గంటల కొద్దీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరీక్షించారు. రైళ్లలో వచ్చిన వారు కూడా స్థానిక ప్రయాణం కోసం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆశ్రయించారు. ఎన్నికల విధుల కోసం ఎక్కువ బస్సులను తరలించడంతో ఉన్న కొద్దిపాటి సర్వీసుల్లో ఇరుకుఇరుకుగా నిల్చొని ప్రయాణించాల్సి వచ్చింది. సీటు దొరికితే అదే పదివేలు అన్నమాటలు వినిపించాయి. జిల్లాలోని రెండు డిపోలనుంచి 110 ఆర్టీసీ బస్సులను ఎన్నికలకు కేటాయించారు. ఆ ప్రభావం జనంపై పడింది. ముఖ్యంగా జిల్లాకు వచ్చిన ఓటర్లు తిప్పలు ఎదుర్కొన్నారు. ఇదిలా ఉండగా ఓటర్లలో ఇదివరకెప్పుడూ చూడని చైతన్యం కన్పించింది. ప్రయాణానికి ఇబ్బందులు పడినా ఆ బాధ వారి మొహాల్లో లేదు. పైగా విక్టరీ చిహ్నం చూపుతూ ఉత్సాహంగా ప్రయాణం సాగించారు.


↑ విజయనగరం: బస్సులో సీటు కోసం ప్రయాణికుల పాట్లు


రైలు దిగి వస్తూ విక్టరీ గుర్తు చూపుతున్న జిల్లా వాసులు ←

చెన్నై నుంచి వస్తున్నా: శ్రీదేవి



ఓటు హక్కును వినయోగించుకునేందుకు చెన్నై నుంచి వచ్చాను. దత్తిరాజేరు మండలం మానాపురం వెళ్లేందుకు గంటల తరబడి బస్సుకోసం ఎదురు చూడాల్సి వచ్చింది. చేసేదిలేక ఆటోలో ఊరు వెళ్తున్నాం.

బస్సులుంటే బాగుండు: సాంబమూర్తి



నేను తమిళనాడులో ఉద్యోగం చేస్తున్నాను. ఓటు హక్కు వినియోగించుకునేందుకు రామభద్రపురం వెళ్తున్నాను. ట్రైన్ దిగి గంటకు పైగా సమయం అయ్యింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులు మాత్రం రాలేదు. బస్సులు అందుబాటులో ఉంటే బాగుండేది.

పెద్దల మాట

నేడు స్వార్థ రాజకీయాలే అధికం

(శృంగవరపుకోట రూరల్)



నేటి రాజకీయాలు స్వార్థంతో నిండిపోయాయి. నాటి రాజకీయాలు నేడు మచ్చుకైనా కనిపించడం లేదు. నాడు మమ్మల్ని ఓట్లు అడిగే సమయంలో వారు ఏ హామీ ఇచ్చినా కచ్చితంగా నేరవేర్చడంతో పాటు కించిత్తు అహంభావం, గర్వం వంటివి లేకుండా అందరినీ సమానంగా చూసేవారు. నేను 1923లో పుట్టాను. ఐదో తరగతి వరకు చదువుకున్నాను. అప్పుడు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నా. మొదటి ఓటు ఒక రేకుడబ్బాలో వేసినట్లు గుర్తు. రంగుల కాగితం ఇచ్చి ప్రతి అభ్యర్థికి కేటాయించిన రంగుడబ్బాలు ఉంచేవారు. మాకు ఏ అభ్యర్థి నచ్చితే.. ఆరంగు కాగితం తీసుకొని ఆ డబ్బాలో వేసేవారం. ఈ ఎన్నికల్లో యువత తమకు మేలు చేసిన వారిని ఎన్నుకోవాలి.

-సేనాపతి కోటరావునాయుడు (101), శతాధికవృద్ధుడు, కొట్టాం

సంక్షేమ పాలకుడు ఎన్టీఆరే

(బొబ్బిలి)



సంక్షేమ పాలకుడు అంటే ఎన్టీఆర్ పేరు గుర్తుకొస్తుంది. ఆయన సీఎం అయ్యాక కిలో రెండు రూపాయలకు బియ్యం ఇచ్చాడంటే అది ఆషామాషీ ఏమీ కాదు. ఆనాడు బియ్యం వండుకొని మూడు పూటలా తినడం పేదలు ఎరుగరు. మహానుభావుడు ఎన్టీఆర్ బియ్యం ఇచ్చిన తరువాత అన్నం వండుకొని తినే కుటుంబాలు బాగా పెరిగాయి. చంద్రబాబు పెట్టిన అన్న క్యాంటీన్ కూడా అలాంటిదే. బ్రిటీషు కాలం నుంచి బొబ్బిలి ప్రాంతంలో షుగర్ ఫ్యాక్టరీలంటే ఎంతో పేరు.. విలువ ఉండేది. చెరకు రైతులు బాగుపడాలంటే ఫ్యాక్టరీని మూసివేయకుండా పక్కాగా నడపాల్సిందే. అందరికీ అన్ని రకాలుగా ఉపాధి కలుగుతుంది. మిగిలిన ఫ్యాక్టరీలన్నిటినీ మంచిగా నడిపించాలి. రాజకీయాలను పక్కన పెట్టి.. అందరూ బాగుండాలన్న తపన నాయకుల్లో పెరగాలి.

- నడిగట్ల రాము(73), పాత బొబ్బిలి

ఎన్నికలు వస్తే కోలాహలమే

(మక్కువ)



అప్పటి రోజుల్లో ఎన్నికలు వస్తే గ్రామాల్లో కోలాహలంగా ఉండేది. పోటీ చేసే అభ్యరుల చిత్రాలను తోపుడుబళ్లపై అంటించి మైకులతో ప్రచారం నిర్వహించేవారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభ్యర్థులను గుర్తించి చదివి వినిపించి ప్రతి ఊరులోనూ అన్ని వీధుల్లో కలియదిరిగేవారు. ఎన్నికల ప్రచారంలో తాగేందుకు టీ, సోడాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. అభ్యర్థులు ఎక్కువగా రచ్చబండల వద్ద సమావేశాలు నిర్వహించి తమకు ఓటు వేసి గెలిపించాలని కోరేవారు. ఎన్నికల అనంతరం గెలిచిన, ఓడిన అభ్యర్థులు ఇద్దరూ ప్రజలకు అందుబాటులో ఉండేవారు. సమస్యలపై స్పందించేవారు. అప్పట్లో రాజకీయ కక్షలు, విభేదాలు చాలా తక్కువ. నేటి రాజకీయాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి.

- బూరాడ ఎర్ర అప్పన్న, మక్కువ మండలం

ఓటు వేయడానికి ఆనందంగా ఉండేది

(సాలూరు రూరల్)



ఓటు వేయడానికి అప్పట్లో ఆనందంగా ఉండేది. ఎన్నికలు అంటే సందడిగా సాగేవి. ఇప్పుడు పోటీ పడినోళ్లు బోలెడు చెబుతారు. వారి చెప్పినవి వింటాం. గతంలో ఓటు వేయడానికి ఎటువంటి ప్రలోభాలు పెట్టేవారు కాదు. ఇప్పుడు రోజులు మారాయి. ఓటు వేయాలని డబ్బు ఖర్చు పెడుతున్నారు. ఇలాంటి పద్ధతిని ఈతరం వారు దూరం పెట్టాలి. ఓటును నచ్చినోళ్లకు నిజాయితీగా వేయాలి. అప్పుడు పార్టీ కంటే పోటీ పడేవారి గురించి తెలుసుకొనే వాళ్లం. ఇప్పుడు పార్టీ ప్రభావం అధికంగా కనిపిస్తోంది. మనకు మేలు చేసిన వారికే ఓటు వేయాలి.

- ఎ.దాలమ్మ (76), కొత్తవలస, సాలూరు మండలం

ఓటు వేయాలంటే ఎన్ని కష్టాలో..



మారుమూల గ్రామమైన లొడ్డకు కాలి నడకన వెళుతున్న గిరిజన మహిళలు

- మన్యం వాసులకు రవాణా సమస్యలు
- దశాబ్దాలుగా పరిష్కారం కాని వైనం

(కొమరాడ)

మన్యం వాసులు ఓటు వేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సరైన రవాణా సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అనేక గ్రామాల ప్రజలు నేటికీ ఓటెయ్యాలంటే కిలోమీటర్ల దూరం నడక సాగించాల్సిన పరిస్థితి ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా మారుమూల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మారుస్తుండడంతో ఆ గ్రామాల ప్రజలు కొండలు, గుట్టలు ఎక్కుతూ కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఓటెయ్యాల్సిన పరిస్తితి ఏర్పడింది. మన్యం ప్రాంతంలో నేటికీ కనీసం ద్విచక్ర వాహనం వెళ్లలేని గ్రామాలు అనేకం ఉన్నాయి. కొమరాడ మండలం నయా పంచాయతీ మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ నయాలోని పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ పంచాయతీ పరిధిలో 9 గ్రామాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రానికి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న లొడ్డ, వాటకోసు, దేరుపాడు, వనకాబడి, తదితర గ్రామాల నుంచి ఓటర్లు నయాలో ఉన్న పోలింగ్ కేంద్రానికి చేరుకోవలసిన పరిస్థితి ఉంది. ఈ పోలింగ్ కేంద్రంలో 774 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

చోళ్లపదం పంచాయతీ రెబ్బ, వనాధార గ్రామాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నాగావళి నది దాటి చోళ్లపదంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి చేరుకోవలసి ఉంటుంది. ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక గిరిజన గ్రామాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే కిలోమీటర్ల కొలదీ కాలినడకన వెళ్లవలసిన పరిస్థితి ఉంది. ఈ కారణంగానే గిరిజన గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతోంది.

పాలకుల హామీలు నీటి మూటలే

గ్రామాలకు రహదారులు నిర్మిస్తామని ఎన్నికల హామీలు గుప్పిస్తున్న నాయకులు అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేటికీ కనీసం ద్విచక్ర వాహనాలు సైతం చేరుకోలేని గ్రామాలు అనేకం ఉండటం బాధాకరం. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులను డోలీ మోతతో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొరియా ఓటర్ల పరిస్థితి ఏంటో!

- అటో ఇటో ఒకవైపే వేయాలంటున్న అధికారులు

సాలూరు రూరల్, మే 12: కొరియా గ్రూప్ ఓటర్లు సాధారణంగా ఇరు రాష్ట్రాలలో ఓట్లు వేస్తారు. గతంలో వేర్వేరు తేదీల్లో ఎన్నికలు జరిగినప్పుడు ఇదే విధంగా ఇరు రాష్ట్రాలలో ఓట్లు వేసేవారు. ఒడిశాలో కొరాపుట్ లోక్‌సభ, పొట్టంగి అసెంబ్లీ, ఏపీలో అరకు లోక్‌సభ, సాలూరు అసెంబ్లీకి ఈ నెల 13న ఏకకాలంలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఏక కాలంలో ఒక వ్యక్తి ఇరు చోట్ల ఓట్లు వేయకూడదు. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులు తర్జన భర్జన పడ్డారు. రెండు రాష్ట్రాల్లో ఒకే రోజు ఎన్నికలు కావడంతో ఏ రాష్ట్రానికి అధికంగా వారి మద్దతు ఉంటుందోనని ఉత్కంఠ నెలకొంది. తమ రాష్ట్రానికి అధికంగా ఓటింగ్ జరిగే విధంగా ఒడిశా సకల ప్రయత్నాలు చేస్తోంది. ఏపీ ప్రభుత్వం కొరియా వాసుల కోసం నేరేళ్లవలస, శిఖపరువు, కురుకూటిల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఏపీ పోలింగ్ కేంద్రాలకు కొరియావాసులు రావాలంటే గరిష్ఠంగా 22 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఏపీ ఓటర్ల జాబితా ప్రకారం 2,554 మంది ఓటర్లు ఉన్నారు. ఒడిశా మాత్రం వారి గ్రామాలకు సమీపంగానే కొరియా, పగులుచెన్నారు, ముడకారు, గంజాయిభద్ర, రణసింగి, గాలిగబడారు, తావుపోదర్, గెమ్మెల పోదర్, తురియాలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసింది. ఒడిశా జాబితా ప్రకారం 5,502 మంది ఓటర్లు ఉన్నారు. కొరియావాసులు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. వారు తమకు ఇష్టమైన చోట ఒక ఓటును వేసుకోవచ్చునని సాలూరు ఆర్వో విష్ణు చరణ్ అభిప్రాయపడ్డారు. మరి వారు ఎటువైపు మొగ్గు చూపుతారో చూడాలి.



వాహనంపై ఇలా..(ఫైల్)



నడిచివస్తున్న కొరియా వాసులు (ఫైల్)

ఓటు ఎక్కడ ఉందో!

భామిని: ఆదివాసీల్లో అనేక మంది తమ ఓటు ఎక్కడ ఉందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఒక పోలింగ్ బూత్ పరిధిలోని వారికి మరో బూత్‌లో ఓటు ఉండడం... అనేక గ్రామాల్లో స్లిప్పులు అందకపోవడంతో ఆదివాసీలు గందరగోళానికి గురవుతున్నారు. మణిగ, బొడ్డగూడ పోలింగ్ కేంద్రాల్లో పలువురి ఓట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉంది. పల్లపు ప్రాంతాల్లో బీఎల్‌వోలు, సిబ్బంది ఓటరు స్లిప్పులు ఇచ్చారు. కొండ ప్రాంతంలో మాత్రం ఓటరు స్లిప్పులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు.



నా ఓటు బత్తిలిలో..

నా ఓటు 2019 నుంచి బత్తిలిలో కొనసాగుతోంది. ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయని.. సరిచేయాలని అనేకసార్లు అధికారులకు చెప్పినా మార్పు లేదు. బొడ్డగూడ పంచాయతీ పరిధిలోని బంద్రసింగిలో ఉంటున్నాను. బొడ్డగూడలోనో లేదా భామినిలోనో నాకు ఓటు ఉండాలి. కానీ బత్తిలిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఓటు వేయడం మన హక్కు. కాబట్టి తప్పని పరిస్థితిలో ఓటు వేయడానికి వెళుతున్నా.

- ఆరిక నాగేశ్వరరావు, రైతు, బంద్రసింగి



ఓటరు జాబితాలో తమ ఓటును చూసుకుంటున్న దృశ్యం

కొండ శిఖరాన పోలింగ్ కేంద్రం

- ఓటు వేయడానికి ఇక్కట్లు

భామిని: తివ్వకొండ శిఖరాన మణిగలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల పల్లపు ప్రాంతంలో ఉన్న మూలగూడ, యాతంగూడ గిరిజన ప్రాంతాల నుంచి ఏడు కిలోమీటర్లు నడిచి కొండ ఎక్కి ఓటు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. మణిగ పోలింగ్ కేంద్రంలో నెట్‌వర్క్ సౌకర్యం లేనప్పటికీ ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్ మేరకు అక్కడ ఏర్పాటు చేశారు. 505 మంది ఓటు వేసేందుకు ఈ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బొడ్డగూడ పోలింగ్ కేంద్రానికి కొండ శిఖరాన ఉన్న కోటకొండ, బంద్రసింగి, కడంబసింగి, కోసిమానుగూడ తదితర గ్రామాల నుంచి సుమారు ఐదు కిలోమీటర్లు కాలి నడకన వెళ్లాల్సి వస్తోంది. సతివాడ పోలింగ్ కేంద్రానికి పాలీస్‌కోట, పోలవరం, కొత్తగూడ గ్రామాల ఓటర్లు వెళ్లాల్సి ఉంది. ఈ మూడు కేంద్రాల్లో ఓటు వేసేందుకు ఆదివాసీ గిరిజనులకు తిప్పలు తప్పడం లేదు.



కొండ శిఖరాన ఉన్న మణిగ పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రానికి ఎలా వెళ్లాలో తెలియడం లేదా?

- నా ఓటు యాప్‌ను వినియోగించుకోండి
- అరచేతిలో ఎన్నికల సమగ్ర సమాచారం

(విజయనగరం)

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు... ఓటర్ల సౌకర్యార్థం 'నా ఓటు' అనే నూతన యాప్‌ను ఎన్నికల సంఘం తీసుకువచ్చింది. ఎన్నికల సమగ్ర సమాచారాన్ని తెలుసుకునే విధంగా దీన్ని రూపొందించింది. దీని కోసం చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే సరిపోతుంది. సోమవారం జరిగే పోలింగ్‌లో ఓటు హక్కును సులువుగా వినియోగించుకునేందుకు ఈ యాప్ దోహదపడుతుంది. ఇందులో వివిధ అంశాలు పొందుపరిచారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని సేవలు పొందవచ్చు. ఓటర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఈ యాప్‌లో ఉంది. ఓటరు సెర్చ్ ద్వారా వివరాలను తెలుసుకోవచ్చు. పేరు, తండ్రి పేరు, వయస్సు, లింగం, జిల్లా, నియోజకవర్గం నమోదు చేస్తే అన్ని వివరాలు తెరపై కనిపిస్తాయి. ఎలక్ట్రానిక్ ఫొటో ఐడెంటిటీ కార్డు (ఎపిక్ సంఖ్య)తో సహా కేంద్రాల వివరాలు వస్తాయి. ఒక వేళ ఇవన్నీ కాకుండా ఎపిక్ సంఖ్య నమోదు చేసినా ఓటరు వివరాలు పూర్తిగా తెలుస్తాయి.

దివ్యాంగుల కోసం..

దివ్యాంగుల కోసం నా ఓటు యాప్‌లో పికప్ సర్వీసు యాప్ ఉంటుంది. వారు తమ ఎపిక్ సంఖ్యను నమోదు చేస్తే బీఎల్‌వోకు పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలనే సమాచారం వెళ్తుంది. దివ్యాంగుల ఫోన్ నెంబర్లు అనుసంధానమై ఉండాలి. అలా లేకపోయినా సంబంధిత బీఎల్‌వోకు ఫోన్ చేస్తే వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తారు.

ప్రభుత్వం పంపిణీ చేసే ప్రతి ఓటరు స్లిప్‌పై సంబంధిత బీఎల్‌వో నెంబరు ఉంటుంది. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసినా లోకేషన్ వస్తుంది.

అభ్యర్థుల వివరాలు కూడా...

నియోజకవర్గంలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల సమాచారంతో పాటు వారి పార్టీ పేరు నా ఓటు యాప్‌లో కనిపించనున్నాయి. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, నియోజవర్గాల రిటర్నింగ్ అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లతో పాటు ఈ మెయిల్ వివరాలను సైతం పొందుపరుస్తారు.

పోలింగ్ కేంద్రానికి మార్గం..

నా ఓటు యాప్‌లో పోలింగ్ కేంద్రానికి ఎలా చేరుకోవాలో తెలిపే ఆప్షన్ ఉంది. ఇందులో ఓటర్లు తాము ఉన్న ప్రాంతం నుంచి నిర్దేశిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి రూట్ మ్యాప్ ఉంటుంది. దీని కోసం జీపీఎస్ ఆప్షన్ ఉన్న ఫోన్‌ను వినియోగించాల్సి ఉంటుంది. యాప్‌లో పోలింగ్ స్టేషన్, సమీపంలో ఉండే బస్టాండ్ వివరాలు తెలుసుకోవచ్చు.

ఎన్నికల విధుల్లో.. ఎన్‌సీసీ కేడెట్లు

(విజయనగరం)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులకు ఓపీవోలు, ఎన్‌సీసీ కేడెట్లను ఎన్నికల కమిషన్ నియమించింది. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అదర్ పోలింగ్ ఆఫీసర్లుగా (ఓపీవో) నియమించేందుకు ఈసీ అనుమతించింది. వీరితో పాటు ఎన్‌సీసీ కేడెట్లు ఎన్నికల విధుల్లో పాల్గొనేలా అవకాశం కల్పించారు. ఓపీవోలు పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు సిరా గుర్తు పెట్టడం వంటి పనులకు సహకరిస్తారు. కేడెట్లు ఓటర్లను క్యూలైన్లో ఉంచేలా చర్యలు తీసుకోవడం... వృద్ధులకు పోలింగ్ కేంద్రం లోపలికి తీసుకువెళ్లడం వంటి విధులు నిర్వహించనున్నారు. వీరంతా ఆదివారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

బిర్యానీ రెడీ!

- ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వైసీపీ నాయకుల ఎర

(విజయనగరం)



పోలింగ్‌కు మరికొద్ది గంటలు మాత్రమే మిగిలి ఉంది. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకు నేందుకు అభ్యర్థులు పాట్లు పడుతున్నారు. మద్యం, బిర్యానీ పంపిణీ చేసి ప్రసన్నం చేసుకోవడానికి తంటాలు పడుతున్నారు. అనేక గ్రామాల్లో ఇంటింటికి డబ్బులు, అవసరమైన చోట మద్యం పంపిణీ పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కొన్నిచోట్ల అధికార పార్టీకి చెందిన నాయకులు హోటళ్లలో ముందే ఆర్డర్ చేసి... టోకెన్ ఇచ్చిన వారికి మాత్రమే బిర్యానీ, భోజనాలు అందించాలని ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. సర్వేలు టీడీపీ కూటమికి అనుకూలంగా ఉండడంతో వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లను తమ వైపునకు తిప్పుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు.

కొంతమందికే పంపిణీ

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కొంతమంది నాయకులను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. తమ ప్రాంతంలో ఇంతమంది ఓటర్లు ఉన్నారు... ఇంత మొత్తం అవుతుందని చోటా నాయకులు అభ్యర్థులకు తెలియజేస్తున్నారు. వారి నుంచి డబ్బు తీసుకొచ్చిన నాయకులు కొంతమంది ఓటర్లకే పంపిణీ చేసి మిగిలిన మొత్తం తమ వద్ద ఉంచుకుంటున్నారు. పైకి మాత్రం అందరికీ పంపిణీ చేసినట్లు అభ్యర్థులకు లెక్కలు చెబుతున్నారు. మరికొందరు ఓటర్లకు ఇవ్వాలని అభ్యర్థులు చెప్పిన మొత్తంలో కొంత కోత వేసి...పంపిణీ చేస్తున్నారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి సోమవారం 13 మే 2024



ఓటుకు పోదాం.. చలో చలో..

- అది మన హక్కు
- నిజాయితీ గల నేతలను ఎన్నుకుందాం
- వ్యవస్థల మార్పునకు పునాది వేద్దాం
- మన భవిష్యత్తు రాతను మార్చుకుందాం
- లేదంటే ప్రశ్నించే హక్కును కోల్పోతాం

ఎన్నికల సమయం వచ్చేసింది. మన భవిష్యత్తును నిర్ణయించుకునే సమయం ఆసన్నమైంది. రేపు మన పాలకులు... పాలన ఎలా ఉండాలో నిర్ణయం తీసుకోవలసింది ఈ రోజే. ఈ రోజు సమయాన్ని... అవకాశాన్ని వినియోగించుకోకుంటే... రేపు మన కళ్ల ముందు ఏం జరుగుతున్నా... నిస్సహాయంగా నిలుచోవలసి వస్తుంది. అందుకే ఓటుతో మన భవిష్యత్తును లిఖించుకుందాం.

(విజయనగరం)

ఈ ఎన్నికల్లో మీ ఓటు హక్కును వినియోగించుకోండి. ఓటు విలువను గుర్తించండి. సాధారణంగా చాలామంది తమ ఓటు లెక్కలోకి రాదులే అనుకుంటారు. మరికొందరు తాను ఒక్కడినే ఓటు వేయకపోతే ఏమవుతుందిలే అని చెప్పి పోలింగ్ రోజు కుటుంబం, స్నేహితులతో కాలక్షేపం చేస్తుంటారు. మరి కొంతమంది సరైన అభ్యర్థి లేకపోవడంతో ఓటు వేయలేదని చెబుతుంటారు. ఒక నియోజవర్గంలో సరాసరి 54 శాతం మంది మాత్రమే ఓటు వేస్తున్నట్లు గణంకాలు చెబుతున్నాయి. ఇందులో గెలిచే పార్టీకి 16 నుంచి 20 శాతం ఓట్లు మాత్రమే పడుతున్నాయి. ఆ పార్టీ ఆధిక్యత 5 శాతం కంటే తక్కువే ఉంటోంది. దీనివల్ల విజయం సాధించిన అభ్యర్థికి ఓటర్లపై చులకక భావం ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకుని.. ఓటింగ్ శాతాన్ని పెంచాలి.

స్వీప్‌తో అవగాహన

ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) విశేషంగా కృషి చేస్తోంది. ఓటు హక్కు నమోదు నుంచి మార్పు, చేర్పులు, సవరణలు ఇతర సమస్యలపై క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఎన్నికల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల కోసం ఈసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

అశ్రద్ధ వద్దు..

ఓటు హక్కు వినియోగంపె అశ్రద్ధ చేయవద్దు. పోలింగ్ బూత్‌కు వెళ్లి ముందు వరుసలో నిల్చుని హక్కును వినియోగించుకోవాలి. పోలింగ్ శాతం గణనీయంగా పెరగడానికి ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేయవచ్చు. అంటే 11 గంటల సమయం ఉంటుంది. అయినా చాలామంది ఓటేసేందుకు ముందుకు రారు. ఎన్ని పనులు ఉన్నా ఓటు వేసేందుకు సమయం కేటాయించాలి. రాజ్యాంగం కల్పించిన హక్కుపై అశ్రద్ధ చేయవద్దు.

కావలసిన గుర్తింపు పత్రాలు

పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఫొటో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు (కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థ జారీ చేసినవి), ఫొటో ఉన్న బ్యాంకు లేదా తపాలా ఖాతా పాస్‌బుక్‌లు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీ ఐ ఇచ్చిన స్మార్ట్‌కార్డు, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్‌కార్డు, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటో ఉన్న పింఛను పత్రం, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జారీ చేసిన గుర్తింపు కార్డు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

- ర్యాంపు, చక్రాల బండి, చూపులేని ఓటర్ల కోసం వలంటీర్ల సహాయానికి అనుమతి.
- ఓటు వేయడంలో అసామర్థ్యాల వ్యక్తులకు, వయో వృద్ధులకు ప్రాధాన్యం.
- ఈవీఎంలపై బ్రెయిలీ లిపి సదుపాయం.
- పురుషులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు.
- ఒక పురుష ఓటరు, ఇద్దరు మహిళా ఓటర్లకు పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశం.
- గుర్తించిన ప్రదేశాల్లో మహిళలకు మాత్రమే పోలింగ్ కేంద్రం.
- ఓటర్లకు ఫొటో ఓటరు స్లిప్పులు
- పోలింగ్ కేంద్రంలో తాగునీరు, అత్యవసర చికిత్స సదుపాయం, మరుగుదొడ్లు.
- అసామర్థ్యాలున్న వ్యక్తులకు ఉచిత రవాణా.

వీటిని గుర్తుంచుకోండి..

సెల్‌ఫోన్లు సహా ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరు.


- వరుసలో నిలబడి మీ గుర్తింపు కార్డును, ఓటర్ చీటీని సిద్ధంగా ఉంచుకోండి.
- ఓటు వేయడానికి ఈవీఎంపై మీట నొక్కండి. అనంతరం బీప్ అనే శబ్దం వినిపిస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి పేరు, గుర్తుకు ఎదురుగా ఎర్రలైటు వెలుగుతుంది
- పైన చూపించిన విధంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థి క్రమసంఖ్య, పేరు, గుర్తుకు ఎదురుగా ఉన్న ప్రింటర్ ఒక బ్యాలెట్ స్లిప్‌ను వీవీ ప్యాట్ ముద్రిస్తుంది. యంత్రానికి చెందిన అద్దంలో నుంచి ప్రింట్ చూడండి. ఏడు సెకన్లు ఉంటుంది.

పోలింగ్ ఏజెంట్లే కీలకం

సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లదే కీలకమైన పాత్ర. పోలింగ్ బూత్‌లో ఉన్న ఏజెంట్లందరూ ఒక్కటైపోతే దొంగ ఓటర్లు సులువుగా ఓటు వేసుకునే అవకాశం ఉంటుంది. అందుకే పార్టీ నాయకులు ఏజెంట్ల ఎంపిక విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారినే నియమిస్తారు. దొంగ ఓట్లు వేసే వారిని అడ్డుకోవడం.. ఒకవేళ దొంగ ఓటు వేయడానికి ఎవరైనా వస్తే వారిని గుర్తించి పోలింగ్ అధికారులకు తెలియజేయడం వంటివి చేస్తుంటారు. ఓటర్లను పోలింగ్ ఏజెంట్లు గుర్తించిన తరువాతే ఓటు వేసేందుకు పోలింగ్ సిబ్బంది అనుమతిస్తారు. వాస్తవంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ అభ్యర్థుల తరఫున ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. ఇందుకు ముందుస్తుగా ఫొటో గుర్తింపు కార్డు ఇస్తారు. గతంలో ఎన్నికల అధికారుల ఫొటోలు లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసేది. ఒకరి తరుపున మరొకరు ఏజెంట్లుగా వ్యవహరించే అవకాశం ఉన్నందున ఎన్నికల అధికారులు గుర్తింపుకార్డులు ఇస్తున్నారు.

ఇవీ నిబంధనలు

- పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరై ఉండాలి.
- ఓటు వేయడానికివచ్చే వారిని గుర్తించేందుకు మాత్రమే ఏజెంట్లను నియమిస్తారు. అంతేకానీ వారికి ఎలాంటి అధికారాలు ఉండవు.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ప్రచారాలు చేయరాదు.
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక అభ్యర్థికి ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమించుకునే వీలుంది.
- ఇద్దరు ఏజెంట్లు ఒకేసారి ఉండేందుకు అనుమతించరు.
- పార్లమెంట్‌కు ఇద్దరు.. అసెంబ్లీకి ఇద్దరు చొప్పున బరిలో ఉన్న అభ్యర్థులు నియమించుకోవచ్చును.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలను చూడాల్సి ఉంటుంది.




పాలకొండ: పోలింగ్ సామగ్రితో కేంద్రానికి బయలుదేరిన సిబ్బంది


పాలకొండ: ఎన్నికల విధులకు సిద్ధమవుతున్న సిబ్బంది

విధులకు సిద్ధమై..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. విజయనగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, గజపతినగరం, ఎస్.కోట, సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గ కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సామగ్రితో సిబ్బంది ఆదివారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మెటీరియల్‌ను తరలించారు. రోజంతా ఎక్కడ చూసినా ఎన్నికల అధికారుల హడావిడే కనిపించింది. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఫ్లాంక్‌లు, పేపర్లు, ఇతర మెటీరియల్‌ను తమతో పాటు తీసుకెళ్లారు. సిబ్బందిని సామగ్రిని తరలించేందుకు ఆర్టీసీ సర్వీసులతో పాటు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను కూడా వినియోగించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


పార్వతీపురం టౌన్: ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా అధికారులు, సిబ్బంది


విజయనగరంలో పోలింగ్ సామగ్రితో బస్సు ఎక్కుతున్న సిబ్బంది


బొబ్బిలిలో ఏర్పాట్లు..


విజయనగరం: పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆటోలు


బస్సులో పోలింగ్ సిబ్బంది


ఎన్నికల విధుల్లో దివ్యాంగుడు


సాలూరు: ఎన్నికల సామగ్రితో సిబ్బంది


ఎస్‌కోట: సామగ్రి పంపిణీలో పోలింగ్ అధికారులు, సిబ్బంది


రాజాంలో ఏర్పాట్లు..


నెల్లిమర్ల: పోలింగ్ విధులకు హాజరుకానున్న పోలీసులు


బొబ్బిలి ఆర్వో కార్యాలయం ప్రాంగణంలో నేలపైనే ఎన్నికల సిబ్బంది


రాజాం: ఆర్వోకు సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి



ఎస్.కోట: పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకున్న ఉద్యోగులు


రామభద్రపురం పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు

ఓటుకు సిద్ధం

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద అధికారులు బిజీ
- ఎన్నికల సామగ్రి తరలింపు
- పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది


బొబ్బిలి: భోజనాల కోసం క్యూలైన్‌లో ఉన్న సిబ్బంది

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. సోమవారం జరగనున్న ఎన్నికల కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సోమవారం నిర్వహించనున్న పోలింగ్ నిర్వహణకు వచ్చే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు ఇతర సిబ్బందికి తిప్పలు తప్పలేదు. బొబ్బిలి గ్రోత్‌సెంటరులోగల ఆర్‌డీవో కార్యాలయంలో డిస్ట్రిబ్యూషన్ సెంటరును ఏర్పాటు చేశారు. సామాజిక వనం ప్రాంగణంలోని చెట్లన్నిటినీ పూర్తిగా నరికివేసి నేలను చదును చేసి అక్కడ ఎన్నికల సిబ్బందికి కౌంటర్లు ఏర్పాటు చేశారు. రోడ్లమీద, కాలువల గట్లుపైన, మండుటెండలో అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో నిరీక్షించాల్సి వచ్చింది. భోజనాల కోసం ఏర్పాటు కోసం కౌంటరు కూడా కిటకిటలాడిపోయింది. కొంతమందికి రెండో సారి అన్నం పెట్టుకునేందుకు లేకపోవడంతో నిర్వాహకులు భోజనం తెప్పించేవరకు ఖాళీ ఎంగిలి కంచాలతో క్యూలైన్‌లో పడిగాపులు కాశారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడ్డ పీవో, ఏపీవోలు ఇతర సిబ్బంది తమకు కేటాయించిన ఎన్నికల సామగ్రిని, పత్రాలను సరిచూసుకునేందుకు నేలపైనే కూర్చోవాల్సి వచ్చింది. రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ పర్యవేక్షణలో ఏఆర్వోలు త్రినాథరావునాయుడు, రాజారావు, సులోచనారాణి, లాలం రామలక్ష్మి, డీటీలు రెడ్డి సాయికృష్ణ, సుబ్బారావు, సురేష్, నాయుడు హెల్ప్‌డెస్క్‌లో జేసీ రాజు, ప్రసన్నకుమార్, మూడడ్ల శంకరరావు, తదితరులు సేవా కేంద్రాలలో దిశా నిర్దేశం చేశారు. ● **రాజాం రూరల్:** రాజం నియోజకవర్గ పరిధిలోని 284 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 13న సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ తెలిపారు. 2,27,503 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని తెలిపారు. నియోకజవర్గాన్ని 34 రూట్లుగా విభజించామని, 24 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని, 152 కేంద్రాల్లో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, మరికొన్ని కేంద్రాలలో వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల విధుల్లో 344 మంది పీఓలు, అంతే మంది ఏపీవోలు, 1321 మంది ఓపీవోలు పాల్గొంటారన్నారు. ఇంటి నుంచి పోలింగ్ కేంద్రాలకు రాలేని ఓటర్ల కోసం ఆటోలు కూడా అందుబాటులో ఉంచామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసెఫ్ వివరించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రాజాం కమిషనర్ రామ అప్పలనాయుడు, ఎంపీడీవో శ్రీనివాసరావుతో పాటు పలువురు తహసీల్దార్లు, ఎన్నికల విధుల్లో కీలకంగా వ్యవహరించిన పలువురు అధికారులు పిలుస్తున్నా డయాస్ వద్దకు వ చ్చేందుకు చాలామంది ఉద్యోగులు సుముఖత వ్యక్తం చేయలేదు. సార్వత్రిక ఎ న్నికల సందర్భంగా ఇక్కడి తహసీ ల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఆదివారం నెలకొన్న పరిస్థితి ఇది. కార్యక్రమం ఆలస్యం అవుతుండడంతో కార్యాలయప్రాంగణం రసాబాసగా మారింది. దీంతో రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జోసేఫ్ టెంటుల్లో కూచున్న సిబ్బందికి ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేయడంతో విధులకు డుమ్మా కొట్టేందుకు ప్రయత్నించిన ఉద్యోగులు బస్సుల వైపు అడుగులేశారు.


నెల్లిమర్లలో..


గజపతినగరంలో..

కలెక్టర్ ఆరా..

ఇక్కడి తహసీల్దార్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదివారం సందర్శించారు. ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. విధులకు కేటాయించిన ఉద్యోగలకు సంబంధించిన వివరాలను ఆర్.ఓ. జోసెఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. గైర్హాజరైన సిబ్బంది ఉన్నారా అంటూ ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాలకు ఉద్యోగులను తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలతో పాటు ఆయా కేంద్రాలలో సౌకర్యాలకు సంబంధించి కలెక్టర్ ఆరా తీశారు.

● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట నియోజకవర్గంలోని 270 పోలింగ్ బూతుల వద్దకు ఆదివారం ఎన్నికల సామాగ్రిను తరలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఉద్యోగులకు ఈవీఎం, ఈవీప్యాడ్ తదితర సామాగ్రిను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ కృష్ణ అందించారు. వీటిని బస్సుల్లో సెక్టార్లు వారిగా పంపించారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ● **రామభద్రపురం:** మండలంలో సోమవారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. 42 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి ఆరు రూట్లుగా విభజించామన్నారు. దీని కోసం సుమారు 400 మంది పోలింగ్ సిబ్బందిని నియమించామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద విద్యుత్, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ వద్ద పోలీసు బందోబస్తు కూడా విస్తృతంగా ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనకు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించామని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు తెలిపారు. ● **గజపతినగరం:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు గ్రామాలకు తరలి వెళ్తున్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్వో ఎంవీ సూర్యకళ పీవోలు, ఏపీవోలకు ఆర్డర్ కాపీలను అందజేశారు. దీంతో అధికారులు ఈవీఎంలతో గ్రామాలోగల పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. నియోజకవర్గం పరిధిలో ఐదు మండలాలకు 264 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 1,320 మంది పీవోలు, ఏపీవోలు, ఓపీలు ఉన్నట్లు తెలిపారు. అలాగే రిజర్వులో 80మంది పీవోలు, 120 మంది ఏపీవోలు ఉన్నారన్నారు. 33 సెక్టార్లలకు సంబంధించి 33 వాహనాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. గ్రామాలకు ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న సోమవారం జరుగనున్న పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు సర్వం సిద్ధమయ్యింది. నెల్లిమర్ల నియోజకవర్గంలోని నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో మొత్తం 248 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఒక పీవో, ఒక ఏపీవోతో పాటు ఓపీవోలు, అదనపు సిబ్బందిని నియమించారు. ఒక్కో పోలింగ్‌స్టేషన్‌లో మొత్తం ఐదుగురు సిబ్బందిని వంతున నియమించారు. పోలింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రూట్ ఆఫీసర్లను, సెక్టోరియల్ అధికారులను కూడా మండల స్థాయి అధికారులతో నియమించారు. ఎంజేపీఏపీ బాలికల గురుకుల పాఠశాల వద్ద వీరికందరికి పోలింగ్ నిర్వహణ సామగ్రిని అందజేశారు. అలాగే సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసి తరలించారు. నెల్లిమర్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.నూకరాజు ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు జరిగాయి. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భోగాపురం సీఐ ఎ.రవికుమార్, భోగాపురం రూరల్ సీఐ బవి వెంకటేశ్వరరావు, దిశ పోలీస్‌స్టేషన్ సీఐ బి.నాగేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్‌తో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటయింది.

బీఎల్‌వోలపై భారం

- పోలింగ్ బూత్‌కు కేవలం రూ.5 వేలు కేటాయింపు
- ఎటూ చాలవని ఆవేదన
- రెండేళ్లుగా అందని గౌరవ వేతనం


గంట్యాడ మండలంలో సిద్ధమైన పోలింగ్ కేంద్రం

కలెక్టరేట్: గంట్యాడ మండలంలోని ఓ పోలింగ్‌బూత్‌కు ప్రహరీ లేకపోవడంతో ఎక్సకవేటర్‌తో కొంత ఎత్తు వరకు మట్టి వేయాల్సి వచ్చింది. బారికేడ్ల ఏర్పాటుకు కలిపి సంబంధిత బీఎల్‌వో(బూత్ లెవల్ అధికారి) సుమారు రూ.3 వేలు శనివారం ఖర్చు చేశారు. అవసరమైన చోట లైట్లు కూడా కొనుగోలు చేశారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే సిబ్బందికి ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకూ అల్పాహారం, భోజనం, టీ, మంచి నీరు అందజేయాల్సి ఉంది. ఓటర్లకు టెంటు సదుపాయం కల్పించాలి. సుమారు 20 కుర్చీలు అవసరం ఉంటుంది. వీటన్నింటికీ దాదాపు పది వేల రూపాయల వరకూ ఖర్చవుతుంది. ఎన్నికల నిర్వహణకు ఒక్కో పోలింగ్ బూత్‌కు కేవలం రూ.5వేలు కేటాయించారు. ఈ డబ్బులు ఎటూ చాలవని బీఎల్‌వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది.

ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఎన్నికల నిర్వహణకు సుమారు రూ.8వేల నుంచి రూ.10 వేల వరకూ ఖర్చు అవుతుంది. కానీ తహసీల్దార్ల నుంచి రూ.5 వేలు చొప్పున బీఎల్‌వోలకు అందింది. తమ చేతి డబ్బులు పెట్టుకోవడమేనా అని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ కేంద్రంలో పీవో, ఏపీవోలు, ఓపీవోలు, పోలీసు సిబ్బంది కలిపి సుమారు పది మంది విధుల్లో ఉంటారు. ఆదివారం సాయంత్రం ముందుగా టీ, స్నాక్స్ ఇస్తారు. సోమవారం రాత్రి వరకూ భోజనం, అల్పాహారం అందివ్వాలి. అలాగే పోలింగ్ బూత్ వద్ద టెంటు, కుర్చీలు ఏర్పాటు చేయాలి. వీటికి రూ.8వేల నుంచి రూ.10 వేల వరకూ ఖర్చు అవుతుంది. జిల్లా వ్యాప్తంగా 1847 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. డబ్బులు ఎలా సర్దుబాటు చేసుకోవాలా? అనేదానిపై బీఎల్‌వోలు అయోమయంలో ఉన్నారు. మిగిలిన జిల్లాల్లో రూ.8 వేలు అందజేస్తుండగా ఈ జిల్లాలో మాత్రం రూ.5 వేలు ఇచ్చారని సమాచారం. ఇదిలా ఉంటే బీఎల్‌వోకి గౌరవ వేతనం కింద నెలకు రూ.500 చొప్పున ఇచ్చేవారు. రెండు సంవత్సరాల నుంచి కొన్ని నియోజకవర్గాల్లో ఇవ్వలేదు. ఎన్నికల శిక్షణ కోసం అనేక సార్లు ఆర్‌వో కార్యాలయానికి సొంత ఖర్చులతో వెళ్లారు. నిత్యం తమ జేబులో నుంచి డబ్బులు తీయాల్సి వస్తోందని బీఎల్‌వోలు వాపోతున్నారు.

విజయనగరంలో 2,53,864 మంది ఓటర్లు

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సమ యం ఆసన్నమైంది. సోమవారం ఉదయం ఏడు గంటలకు పోలింగు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే దీనికి సం బంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. విజయనగరం ని యోజకవర్గానికి సంబంధించి 2,53,864 మంది ఓటర్లు వుండగా, ఇందులో విజయనగరం అర్బన్‌కు సంబంధించి 2,16,923 మంది, థర్డ్ జండర్-27 మంది వున్నారు.. వీరిలో పురుష ఓటర్లు 1,05,222 మంది, మహిళా ఓటర్లు 1,11,674 మంది వున్నారు. అలాగే మండల పరిధిలో 36,312, థర్డ్ జండర్ 2 ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 17,742 మంది, మహిళా ఓటర్లు 18,568 మంది వున్నారు.. పోలింగు కేం ద్రాల విషయానికి వస్తే, 260 పోలింగు కేంద్రాలున్నాయి.

నెల్లిమర్లలో 2,13,551 మంది ఓటర్లు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నియోజకవర్గంలో సోమవారం జరుగనున్న ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో 2,13,551 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1,05,613 మంది పురుషులు కాగా, 1,07,935 మంది స్త్రీలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. నియోజకవర్గ పరిధిలోని నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో మొత్తం 248 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈసారి అత్యధిక శాతం పోలింగ్ జరిగే అవకాశం ఉంది.

చిన్నశిర్లాంలో దారుణ హత్య

- నిద్రిస్తున్న సమయంలో గొంతుకోసి పరారైన దుండగులు
- మృతుడు టీడీపీ సానుభూతిపరుడు

రేగిడి, మే 12: చిన్నశిర్లాంలో శనివారం అర్ధరాత్రి దాటాక దళిత వర్గానికి చెందిన ఉత్తరావల్లి సంగాం(65)ను దారుణంగా హత్య చేశారు. ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో భార్య పక్కన ఉంటుండగానే గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా కత్తితో గొంతుకోసి ఈ దారుణానికి ఒడిగట్టారు. సంగాం టీడీపీ సానుభూతిపరుడు. దీంతో ఈ హత్య రాజకీయకోణంలో జరిగిందా లేక వ్యక్తిగతమా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ఉత్తరావల్లి సంగాం రాజాం కోర్టులో ఉద్యోగిగా పనిచేస్తూ ఐదేళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. రోజూలానే శనివారం రాత్రి ఇంటి ఆరుబయట మంచంపై నిద్రకు ఉపక్రమించారు. భార్య నక్షిత్రమ్మ కూడా పక్కనే ఉన్నారు. అర్ధరాత్రి 1.20 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు కరెంట్ లేని సమయంలో వచ్చి సంగాంపై దాడి చేశారు. పదునైన కత్తితో పీకపై గాయపరచడంతో తీవ్ర రక్తస్రావమై భర్త ఒక్కసారిగా కేకలు వేశాడు. గమనించిన భార్య ఒక్కసారికి హతాశురాలైంది. బైక్‌పై వచ్చిన దుండగలు గొంతుకోసి క్షణాల్లో పరారయ్యారు. కొన ఊపిరితో ఉన్న ఈయన్ను రాజాం కేర్ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో తనువు చాలించినట్లు కుటుంబీకులు తెలిపారు. సంగాంకు ఇద్దరు పిల్లలు కాగా పెద్ద కుమారుడు కిశోర్ కేబుల్‌లో పని చేస్తుండగా, చిన్న కుమారుడు కిరణ్ ఇంటివద్ద ఉంటాడు. సంగాంకు మాజీ జడ్‌పీటీసీ, టీడీపీ నేత మంతిన ఉషారాణి వరుసకు మేనకోడలు. టీడీపీకి సానుభూతిపరుడిగా ఉన్నారు. వివాద రహితుడన్న పేరుంది. ఇలాంటి వ్యక్తి ఎన్నికల ముందురోజు హత్యకు గురికావడం గ్రామంలో సంచలనమైంది. ఈఘటన పోలీసులకు సవాల్‌గా మారింది.


సంగాం (ఫైల్)


ఘటనా స్థలంలో చీపురుపల్లి ట్రైనీ డీఎస్పీ, పోలీస్‌సిబ్బంది

భిన్న కోణాల్లో విచారణ

చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస్ చక్రవర్తి, ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, రాజాం రూరల్ సిఐ శ్రీనివాసరావు, రేగిడి ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం ఉదయం చిన్నశిర్లాంలో సంఘటనా స్థలానికి చేరుకుని భిన్నకోణాల్లో విచారించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌లు రప్పించి హత్యప్రదేశంలో ఉన్న సాక్ష్యాలను సేకరించారు. మృతదేహానికి రాజాం ఏరియా ఆసుపత్రిలో శవపంచనామా, పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు మృతదేహాన్ని అప్పజెప్పారు.

దోషులను తక్షణమే పట్టుకోవాలి: మాజీ జడ్పీటీసీ ఉషారాణి

మామయ్య వివాద రహితుడు. మా గ్రామంలో ఇలాంటి హత్యలు ఎప్పుడూ లేవు. ఎన్నికల వేళ ఈఘటన జరగడం అత్యంత దారుణం. నిందితులను తక్షణమే పట్టుకొని శిక్షించాలి.

సూర్యదేవునికి పూజలు

జామి: మండల కేంద్రమైన జామిలో వైశాఖ ఆదివారం పురస్కరించుకుని మండల కేంద్రమైన జామిలో కలియుగ ప్రత్యక్షదైవం సూర్యదేవునికి పూజలు చేశారు. ఇందులో భాగంగా తమ ఇళ్లముందు సూర్య నమస్కారాలు చేసి స్వామివారికి అరటిపళ్లు, మొక్కపెసలు వంటివి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. ఇవి పురాతనంగా వస్తున్న సంప్రదాయమని ఇలా చేస్తే స్వామికరుణ ఉంటుందని, సంపూర్ణమైన ఆరోగ్యం వస్తుందని తెలిపారు.


జామిలో సూర్యదేవునికి పూజలు

ఘనంగా మాతృదినోత్సవం



గరివిడి: గరివిడి ఓంశాంతి సెంటర్‌లో సెంటర్ ఇన్‌చార్జి లతక్క ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాతృమూర్తులకు ఆటల పోటీలు, పాటల పోటీలు, కుర్చీల ఆట, పలు ఆటలు ఆడించి విజేతలకు బహుమతులు అందించారు. మాతృమూర్తులు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు.

కుర్చీల ఆట ఆడుతున్న మాతృమూర్తులు

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

రామభద్రపురం: మండల పరిధిలోని ఆరికతోట జాతీయరహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై జ్ఞాన ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చర్లవలస గ్రామానికి చెందిన బొడ్డు జగన్మోహన్‌రావు(40) విజయనగరం నుంచి బూసాయవలస వైపు బైక్‌పై వస్తుండగా అదే దారిలో వస్తున్న వ్యాను వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో తలకు తీవ్రంగా గాయమవడంతో జగన్మోహన్‌రావు అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని బాడంగి సామాజిక ఆసుపత్రికి తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మక్కువ: మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధి దిగువ మెండంగి, ఆలగురువు పోలింగ్ కేంద్రాల ను ఎస్ఐ పి.నరసింహమూర్తి ఆదివారం పరిశీలించారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల జాబితాలో ఉండడంతో సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఓటర్ల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న రంగనాథం

రాజాం: రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు, రచయిత గార రంగనాథం సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు భాష సంరక్షణ కోసం ప్రతి తెలుగువాడు పాటుపడాలని వెంకయ్యనాయుడు అన్నారు. వరంగల్‌కు చెందిన శ్రీలేఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాయరత్న మంజూష గ్రంథ రచయిత గార రంగనాథంతో పాటు మరో ఇద్దరికి వెంకయ్యనాయుడు పురస్కారాలను అందజేశారు. రేవూరి అనంత పద్మనాభ రామారావు అధ్యక్షత వహించగా తిరునగిరి రంగస్వామి, గార సీతారత్నం, సమ్మెట నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రంగనాథం

'నేత్రదానం గొప్పది'

రాజాం: అన్ని దానాల కన్నా రక్తదానం, నేత్రదానం గొప్పవని రాజాం రెడ్‌క్రాస్ ఛైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. పెనుబాక గ్రామానికి చెందిన బండి సత్యవతి కుటుంబానికి నేత్రదాన ప్రశంస పత్రం అందజేశారు. ఆదివారం పెనుబాక గ్రామంలో నేత్రదానం చేసిన బండి సత్యవతి 12వ రోజు కార్యక్రమంలో భర్త బండి కృష్ణ, కుమారులు బండి శ్రీను, బండి కోటేశ్వరరావు, బండి నరింహులు, బండి రంగనాథం, కుటుంబ సభ్యులు గ్రామ యువత కలిసి 40 మంది రక్తదాన శిబిరం నిర్వహించారు. 12వ రోజు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ తరఫున ప్రశంస పత్రాలను మెడల్స్‌ను అందజేశారు. చీపురుపల్లికి చెందిన గోవిందరాజులు నేత్రదానంపై అవగాహన కల్పించారు.

ఒకే అధికారి.. మూడు విధులు

రాజాం: రాజాం హౌసింగ్ సబ్‌డివిజన్ డీఈఈ ఎన్‌జీ రత్నం మూడు రకాల విధులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం డీఈఈగా విధులు నిర్వహించడమే కాకుండా రాజాం అర్బన్ ఏఈగా, హౌసింగ్ ఈఈగా సైతం విధులు నిర్వహించడంపై పలు విమర్శలు వస్తున్నాయి. అర్బన్ ఏఈగా పనిచేస్తున్న రొంగళి రాము మూడు నెలలుగా సెలవులో ఉన్నారు. అనారోగ్యం రీత్యా ఆయనకు శస్త్రచికిత్స జరగడంతో ప్రస్తుతం సెలవులో ఉన్నారు. అయితే ఈ పోస్టును రూరల్ ఏగా పనిచేస్తున్న వేణుగోపాలరావుకు అప్పగించకుండా డీఈఈ స్థాయి అధికారి నిర్వహిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. హౌసింగ్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న సంతకవిటి, వంగర, రేగిడి ఆమదాలవలస మండలాల ఏఈలకు అయినా అదనపు బాధ్యతలను అప్పగించాలి. అయినా అలా చేయకుండా ఆయనే విధులను నిర్వహిస్తున్నాడు. దీని కారణంగా గృహ నిర్మాణ లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. డీఈఈ విధులకు ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ ఉన్న వర్క్‌ఇన్‌స్పెక్టర్లు ఏదో ఒక సమాధానం చెప్పాల్సి వస్తోంది. అయితే అర్బన్ ఏఈ రొంగళి రాము అధికారకంగా సెలవు కూడా పెట్టలేదని తెలిసింది. ఈ విషయంలో జిల్లా స్థాయి అధికారులు కూడా ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. పద్ధతి ప్రకారం అయితే అర్బన్ ఏఈ విధులను ఆయన ఆపరేషన్ చేయించుకున్న సమయం నుంచి రూరల్ ఏఈకి విధులను అప్పగించాలి. రూరల్ ఏఈ కూడా గతంలో అర్బన్ హౌసింగ్ ఏఈ విధులను చేపట్టారు. ఆయనకు ఈ విషయంలో కొంత అవగాహన కూడా ఉంటుంది కావున జిల్లా అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకొని రూరల్ ఏఈకి అదనపు బాధత్యలను అప్పగించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

వర్ష సూచనతో రైతుల్లో ఆందోళన

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల రైతుల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు వస్తుండటంతో రైతుల్లో దిగులు మొదలైంది. రబీ వరితో పాటు నువ్వు పంట చేతికొచ్చే సమయంలో వాతావరణంలో మార్పులు రావడంతో పంటను కోత కోయలేని స్థితిలో ఉన్నారు. గత రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి కొంతమేర నష్టం వాటిల్లింది. వర్ష సూచనతో పలు గ్రామాల్లోని రైతులు నూర్పు యంత్రాలతో నూర్పులు చేసి తడి ధాన్యాన్ని అమ్మకానికి సిద్ధమవుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వాతావరణం అనుకూ లంగా లేకపోవడంతో తక్కువ ధరకే అమ్మకం చేస్తున్న పరిస్థితి నెలకొంది. నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో పండిన పంట పాడయ్యే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.


అమ్మకానికి సిద్ధం చేస్తున్న తడి ధాన్యం